

చేపలు చేజారుతున్నాయి

ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేసినప్పుడు చేపలు కొట్టుకుపోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸



వేతన వెతలు

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 /22.1

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

యూరియా గోదాముల తనిఖీ



మాక్లూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్, గ్రోమోర్ గోదాములను జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు రైతులు లేటుగా నాట్లు వేశారని అలాంటి వారికి సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు కూడా అవసరం మేరకే యూరియా చల్లుకోవాలని సూచించారు. వరి పొట్ట దశలో అధిక యూరియా వాడటంతో చీడపీడలు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. సొసైటీ, గ్రోమోర్ గోదాంలలో యూరియా నిల్వలు ఉండటంపై డీఏవో సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారిణి పద్మ ఉన్నారు.

అర్బన్‌పార్క్‌ను సందర్శించిన డీఎఫ్‌వో



మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ శివారులో ఉన్న అర్బన్ పార్క్‌ను శుక్రవారం డివిజనల్ ఫారెస్టు అధికారి భవానీశంకర్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, రోజువారీగా పార్కుకు వస్తున్న సందర్శకుల సంఖ్య వివరాలు తెలుసుకున్నారు. పార్కులో ఎంతమంది డ్యూటీలు చేస్తున్నారని అడిగారు. ఆయన వెంట ఎఫ్‌ఆర్వో అశోక్, బీట్ అధికారి సుశీల్ ఉన్నారు.

నిజాంసాగర్ 4 గేట్ల ఎత్తివేత



నిజాంసాగర్: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 15,296 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నాలుగు వరద గేట్లను ఎత్తి 21,988 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1,404.82 అడుగుల(17.542 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

ఏడు మండలాల్లో అధిక వర్షం

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా వర్షం కురుస్తోంది. ఏడు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. శుక్రవారం 44.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా మోస్రాలో 74.6, చందూరు 71.3, మోర్తాడ్ 65.1, నవీపేట 60.4, ఎడపల్లి 58.5, మోపాల్ 57.7, వర్ని 56.5, నిజామాబాద్ సౌత్ 53.8, ఆలూర్ 52.4. రెంజల్ 51.8, కమ్మర్‌పల్లి 51.4, మాక్లూర్ 51.2, జక్రాన్‌పల్లి 50.9, భీమ్‌గల్ 48.0, ఏర్గట్ల 46.0, సిరికొండ 45.1, రుద్రూర్ 41.2, నిజామాబాద్ నార్త్‌లో 40.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 24 మండలాల్లో సాధారణ, రెండు మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లాలో శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

దేవీరోడ్‌లో వన్ వే



ఖలీల్‌వాడి: నగరంలోని దేవీరోడ్‌లో వన్ వే ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, ఆలయాలు ఉండే ఈ ప్రాంతంలో వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ జామ్ అవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో బారికేడ్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి వన్ వే ప్రారంభించామన్నారు. వాహనదారులు రైల్వే ఫ్లైఓవర్ వైపు నుంచి గంజ్ గేట్–1 మీదుగా, ద్విచక్ర వాహనదారులు దేవిరోడ్ నుంచి సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద బయటకు వెళ్లాలని తెలిపారు. హెవీ వెహికల్స్, ఆటోలు, ఫోర్ వీలర్స్‌కి ప్రవేశం లేదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

అభాగ్యులకు అండగా..

న్యాయసేవా సంస్థ



జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

‘సత్వరం, సమన్యాయం అందించే జిల్లా న్యాయసేవా సంస్థ ప్రజల పాలిట కామధేనువు, కల్పవృక్షం. అభాగ్యులకు అండగా నిలుస్తోంది. రాజీమార్గమే రాజమార్గం నినాదంతో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి కేసులు పరిష్కరిస్తోంది.’అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మూడో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా న్యాయసేవా సంస్థ లక్ష్యాలు, ప్రజలకు ఉపయోగాల పై ‘సాక్షి’తో మాట్లాడారు.

– నిజామాబాద్ లీగల్

- రాజీమార్గమే రాజమార్గం
- కేసుల పరిష్కారం దిశగా కృషి
- నేడు మూడో జాతీయ లోక్ అదాలత్
- జిల్లా న్యాయసేవా సంస్థ చైర్ పర్సన్, ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మి

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి : న్యాయ సేవా సంస్థ లక్ష్యాలు ఏమిటి

జడ్జి : జాతీయ న్యాయసేవా సంస్థ దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో జిల్లా న్యాయసేవా సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై న్యాయ సహాయం అందించడంతోపాటు పరిష్కార మార్గాలను చూపుతోంది.

■ **ఏ సమస్యలపై న్యాయసేవా సంస్థను సంప్రదించవచ్చు**

■ ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై జిల్లా న్యాయసేవా సంస్థను సంప్రదించొచ్చు. భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు, కుల సంఘాల, వీడీసీల ఆధిపత్య ధోరణి, ప్రజా సమస్యలపై స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల నిర్లక్ష్యం, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, గరిష్ట చిల్లర ధరకన్నా అధికంగా వస్తువులు అమ్మడం, హోటళ్లలో వాటర్ బాటిల్ కొనుగోలు చేయాలనే నిబంధన విధించడం లాంటి న్యాయ పరిష్కారం ఉన్న అనేక సమస్యలపై ప్రజలకు న్యాయ సహాయం అందిస్తుంది. ప్రజా సమస్యలపై ప్రభుత్వ శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పుడు న్యాయసేవా సంస్థను సంప్రదిస్తే పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తాం.

■ **న్యాయం పొందడంపై ప్రజల్లో ఎలా అవగాహన కల్పిస్తోంది?**

■ గ్రామాలు, పట్టణాల్లో న్యాయ చైతన్య సదస్సులు నిర్వహిస్తోంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కోర్టులను ఆశ్రయించకుండానే న్యాయ సహాయం పొందేందుకు ప్రీ–లిటిగేషన్, మీడియేషన్ వ్యవస్థ ద్వారా వారి మధ్య మధ్యవర్తిత్వం వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లా న్యాయసేవా సంస్థ హెల్ప్‌లైన్ నంబర్ 15100 సైతం ఏర్పాటు చేసింది.

■ **లోక్‌అదాలత్ ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారు**

■ నిజామాబాద్ జిల్లాలో గతంలో నిర్వహించిన రెండో లోక్ అదాలత్‌లో 29 వేలకు పైగా కేసుల్ని పరిష్కరించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. శనివారం జరగబోయే మూడో జాతీయ లోక్‌అదాలత్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించి ఎక్కువ కేసుల్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాం. అందుకోసం నిజామాబాద్ జిల్లా కోర్టులో 11, బోధన్‌లో 4, ఆర్మూర్‌లో 3 బెంచ్‌లను ఏర్పాటు చేశాం. మూడు సంవత్సరాలకు మించని శిక్షపడే క్రిమినల్ కేసులతోపాటు సివిల్, మోటారు వాహనాల కేసులు, ఇతరత్రా కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించనున్నాం. ఈ సందర్భంగా నల్సా(నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ) నినాదమైన మీడియేషన్ ఫర్ నేషన్ (దేశం కోసం రాజీమార్గం) అనే నినాదాన్ని విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నాం.

■ **వీడీసీల పెత్తనాన్ని ఎలా అదుపు చేస్తోంది**

■ ప్రజలపై ఆధిపత్య ధోరణి అవలంబించే గ్రామాభివృద్ధి కమిటీలపై పోరాడేందుకు జిల్లా న్యాయసేవా సంస్థ సహాయపడుతోంది. జిల్లాలోని పలు వీడీసీలపై అనేకమంది బాధితులు హైకోర్టును సైతం ఆశ్రయించారు. జిల్లా న్యాయసేవా సంస్థ బాధితులను తమ కార్యాలయానికి పిలిపించుకొని ఫిర్యాదులు స్వీకరించి, పోలీసు, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో వీడీసీలపై చర్యలకు ఆదేశించింది. వీడీసీల ఆర్థిక వనరులైన షాపింగ్ కాంప్లెక్స్ వంటి వాటిని సీజ్ చేయడం, అమాయకులైన ప్రజలను వేధించకుండా చర్యలు చేపట్టాం.

జాతీయ లోక్ అదాలత్‌ను ఎందుకు నిర్వహిస్తున్నారు.. లక్ష్యం ఏమిటీ

■ దేశంలో కింది కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు లక్షలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల్లో చట్టాలపై అవగాహన పెరిగి కేసుల సంఖ్య సైతం పెరిగింది. దీంతో కోర్టులపై పనిభారం ఎక్కువైంది. కేసుల్ని పరిష్కరించేందుకు చాలా సమయం పడుతుండటంతో జాతీయ న్యాయసేవా సంస్థ రాజీమార్గమే–రాజమార్గం అనే నినాదంతో ఇరుపక్షాలను లోక్ అదాలత్ ద్వారా ఒక్కచోట చేర్చి వారి సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రయత్నిస్తోంది.

అక్రమ కేసులు.. అప్రజాస్వామికం

- నిజాలు నిర్భయంగా రాయడం తప్పా?
- ‘సాక్షి’ ఎడిటర్, పాత్రికేయులపై కేసులు ఎత్తివేయాలి
- ఏపీ ప్రభుత్వ కుట్రలపై మేధావుల మండిపాటు



నిజామాబాద్‌అర్బన్: ‘ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం జర్నలిజం. ప్రజల సంక్షేమం కోసం పాత్రికేయులు పాటుపడతారు. అలాంటి వారిపై ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయించడం ‘స్వేచ్ఛను హరించడమే’ అవుతుందని మేధావులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. తమకు అనుకూలంగా ఉండాలని జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వ దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు.

స్వేచ్ఛను హరిస్తున్నారు



పత్రికాస్వేచ్ఛను హరించి తమ గుప్పిట్లో ఉంచుకునే ప్రయత్నాలు చేయడం సరైంది కాదు. మీడియా లేకపోతే నేటి సమాజంలో అనేక సమస్యలు తలెత్తేవి. రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛాయుత వాతావరణం, భావ ప్రకటన స్వేచ్ఛ అన్నీ మీడియా వల్లే నేటి సమాజం పొందగలుగుతుంది. అలాంటి వారిపై అక్రమ కేసులు బనాయించడం తగదు.

– అలుక కిషన్, టీజీవో సంఘం, జిల్లా అధ్యక్షుడు

ప్రజాస్వామ్యానికే విరుద్ధం



నేటి సమాజంలో పత్రికలపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియాపై కేసులు పెట్టడం, స్వేచ్ఛాయుత హక్కులను హరించడం సరైంది కాదు. ప్రభుత్వాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేయడం దారుణం.

– లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు

మీడియాపై కేసులు సరికాదు



ఏపీలో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తున్నారు. వాస్తవాలు రాస్తే సాక్షి ఎడిటర్ తోపాటు పాత్రికేయులపై అక్రమంగా కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం. ప్రశ్నించే గొంతుకలపై భౌతికదాడులు చేస్తూ అణచివేయాలని చూడటం సరికాదు.

– ఎస్ సిద్దయ్య, స్నేహ సొసైటీ కార్యదర్శి

అక్రమ కేసులను ఎత్తివేయాలి



ఏపీ ప్రభుత్వం భావప్రకటన స్వేచ్ఛను హరిస్తోంది. ప్రజల పక్షాన జర్నలిస్టులు వాస్తవాలు రాస్తుంటే అప్రజాస్వామ్యంగా కేసులు పెట్టడం సరికాదు. వాక్‌స్వాతంత్ర్యాన్ని అడ్డుకోవడం మానుకోవాలి. అక్రమ కేసులను ఎత్తివేయాలి.

– డాక్టర్ విక్రమ్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్టికల్ 19(1)(ఏ)ను అతిక్రమించడమే..



ఏపీ ప్రభుత్వం సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డిపై కేసులు పెట్టడం భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తికి తన భావాల్ని వెల్లడించే హక్కు ఉంటుంది. వాటిని ప్రచురించే హక్కు మీడియాకు ఉంటుంది. భావ ప్రకటనను పార్లమెంటరీ భాషలో వెల్లడించాలి. ప్రభుత్వ పనుల్లో లోటుపాట్లను పత్రికలు ఎత్తిచూపుతాయి. అంతమాత్రాన వారిపై చర్యలకు పూనుకోవడం ఆర్టికల్ 19(1)(ఏ)ను అతిక్రమించడమే అవుతోంది.

– ఆల్గోట్ రవీందర్, సీనియర్ అడ్వొకేట్, పౌరహక్కుల నాయకుడు

న్యాయ వ్యవస్థ స్పందించాలి



ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉండే పత్రికలపై కుట్రలు, నిరంకుశ విధానాలను ఖండిస్తున్నాం. నిజాలను నిర్భయంగా రాస్తూ ప్రజల పక్షాన నిలిచే సాక్షి పత్రికలో పనిచేసే ఎడిటర్, జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం సరికాదు. ఏపీ ప్రభుత్వ నిరంకుశ విధాలపై న్యాయవ్యవస్థ స్పందించాలి. లేకుంటే నాలుగో స్తంభం బలహీనపడే ప్రమాదముంది.

– బెజుగం సుజాత, ఐద్వా, జిల్లా కార్యదర్శి

డీఫాల్ట్ మిల్లర్లపై ఆర్‌ఆర్ యాక్ట్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- ఆస్తులు వేలం వేసి సీఎంఆర్ నిధులు రికవరీ చేయండి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అందించడంలో విఫలమైన డీఫాల్ట్ రైస్‌మిల్లర్లపై నిబంధనల మేరకు రెవెన్యూ రికవరీ యాక్టును అమలు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఫాల్ట్ మిల్లర్లపై ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, వారి నుంచి రావాల్సిన మొత్తం, ఇప్పటి వరకు ఎంత రికవరీ చేశారనే వివరాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. డీఫాల్ట్ రైస్ మిల్లులతోపాటు మిల్లర్లకు చెందిన ఆస్తులను బ్లాక్ చేయించాలని, అవసరమైతే ఆస్తులను వేలం వేసి సీఎంఆర్ నిధులను రాబట్టే దిశగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సీఎంఆర్ నిధులు పూర్తిస్థాయిలో రికవరీ కావాల్సిందేనని, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. సీఎంఆర్ రికవరీపై ప్రతి వారం సమీక్ష జరుపుతానని, ఎప్పటికప్పుడు ప్రగతి కనిపించాలని అన్నారు.

‘భూభారతి’ దరఖాస్తులు పరిష్కరించాలి

భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

- కేంద్రం నిర్లక్ష్యంతోనే యూరియా కొరత
- రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ వెంకట్, కార్పొరేషన్ చైర్మన్లు, నేతలు

ఆర్మూర్/నిజామాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, డెయిరీ, ఫిషరీష్, క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన నగరంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ఆర్మూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈనెల 15న భారీ వర్షం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కామారెడ్డి సభ రెండు, మూడు రోజులు వాయిదా పడుతుందని, ఆ తర్వాత సభ నిర్వహిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్నివర్గాలను కలుపుకుపోతూ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో కాంగ్రెస్ అంటే మక్కువ పెరిగిందన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. యూరియా కోసం గతంలో కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందని, దీంతో యూరియా సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి శ్రీహరిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం మత్స్యశాఖకు రూ.123 కోట్లు కేటాయించిందన్నారు. వారం రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి రాష్ట్రంలోని 46 వేల చెరువుల్లో 82 కోట్ల చేపపిల్లలు, 24 కోట్ల రొయ్యలను పెంచుతామన్నారు.

సమావేశాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తెలంగాణ పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, వ్యవసాయ కమిటీ సభ్యులు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్లు ముప్ప గంగారెడ్డి, సాయిబాబాగౌడ్, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, నగేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ‘స్వస్థ్ నారీ– స్వశక్త్ పరివార్ అభియాన్’



జూమ్‌మీటింగ్‌లో పాల్గొన్న జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ, ఇతర డాక్టర్లు

నిజామాబాద్ నాగారం: మహిళల ఆరోగ్యం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ‘స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్’ కార్యక్రమాన్ని ఈ నెల 17న ప్రధాని మోదీ ప్రారంభిస్తారని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమ నిర్వహణపై రాష్ట్రస్థాయి అధికారులు శుక్రవారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ‘స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్’లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ప్రత్యేక వైద్య నిపుణులతో ప్రతి రోజు 10 వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. మహిళలు, గర్భిణులకు గుండె సంబంధ, మధుమేహం, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు కంటి, దంత తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ తుకారాం రాథోడ్, డాక్టర్ రాజు, డీపీవో విశాల, డీడీఎం నారాయణ, డీహెచ్‌ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ వాయిదా

- వర్షాలే కారణమంటున్న నేతలు
- త్వరలోనే నిర్వహిస్తామని ప్రకటన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 15న కామారెడ్డిలో జరగాల్సిన బీసీ బహిరంగ సభ వాయిదాపడింది. వర్షాల వల్లే సభను వాయిదా వేస్తున్నామని, సభ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. కామారెడ్డిలో నిర్వహించాల్సిన సభ కోసం ఇటీవల జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. 2 లక్షల మందితో సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. జనసమీకరణ కోసం ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నేతల ఆధ్వర్యంలో మండలాలవారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. అయితే నాలుగైదు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు సభను వాయిదా వేసినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కాగా సభ ఎప్పుడు జరిగినా భారీ ఎత్తున తరలిరావాలంటూ మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పిలుపునిచ్చారు.

16న దిశ సమావేశం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన ఈ నెల 16న ఉదయం 10:30 గంటలకు జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు డీఆర్డీవో సాయాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. అధికారులు సమావేశానికి హాజరుకావాలన్నారు.

క్లుప్తంగా

ముగిసిన జిల్లాస్థాయి సైన్స్‌ సెమినార్‌



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లాస్థాయి సైన్స్‌ సెమినార్‌ శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా జిల్లాకేంద్రంలోని హరిచరణ్‌ మార్వాడి హిందీ విద్యాలయంలో శుక్రవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డీఈవో అశోక్‌ హాజరై, సెమినార్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. అన్ని మండలాల్లో మొదటి స్థానంలో ఎంపికైన విద్యార్థులను సర్టిఫికెట్లు జ్ఞాపికతో సత్కరించారు. రాష్ట్రస్థాయికి భీంగల్‌ మండలం మెండోరా జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థి అంగ ఆర్తి ఎంపికయ్యారు. జిల్లా సైన్సు అధికారి గంగా కిషన్‌, ఎంఈవో సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

సమన్వయంతో ముందుకుసాగాలి



సుభాష్‌నగర్‌: పసుపు రైతులు, వ్యాపారులు, పసుపు బోర్డు సమన్వయంతో ముందుకు సాగాలని, దీంతో భారత పసుపు ప్రపంచ మార్కెట్‌లో మరింత ప్రతిష్టను సాధిస్తుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి అన్నారు. నగరంలోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం చైర్మన్‌ పల్లె గంగారెడ్డితో మహారాష్ట్ర పసుపు వ్యాపారులు సమావేశమయ్యారు. పసుపు పంట నాణ్యత, గ్రేడింగ్‌, సేంద్రియ సాగు, రసాయనిక ఎరువుల వినియోగం, విదేశాల్లో డిమాండ్‌, తదితర అంశాలపై చర్చించారు. రైతులకు లాభసాటి ధర వచ్చేలా బోర్డు కృషి చేస్తుందని చైర్మన్‌ తెలిపారు.

ఉపాధి ఉద్యోగులకు వేతన వెతలు

- ఫీల్డు అసిస్టెంట్‌లకు 3 నెలలుగా, ఇతర ఉద్యోగులకు 2 నెలలుగా అందని జీతాలు
- సకాలంలో చెల్లించాలని సిబ్బంది వేడుకోలు



మోర్తాడ్‌(బాల్కొండ): ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి ఉద్యోగులకు మూడు నెలల వేతనం చెల్లించాల్సి ఉండగా ఏపీవోలు, కంప్యూటర్‌ ఆపరేటర్లు, ఇంజినీరింగ్‌ కన్సల్టెంట్‌లు, టెక్నికల్‌ అసిస్టెంట్‌లకు రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉంది. దీంతో పలువురు సిబ్బంది జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాల్కొండ ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్‌ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ధనుంజయ్‌(45) గురువారం పని చేసే చోటనే గుండెపోటుతో మరణించాడు. అతని మరణానికి సకాలంలో జీతాలు రాకపోవడంతోపాటు, ఆర్థిక ఇబ్బందులే కారణం అని సిబ్బంది చెబుతున్నారు. రెగ్యులర్‌ ఉద్యోగుల మాదిరిగానే ఉపాధి హామీ పథకం ఉద్యోగులు క్రమశిక్షణతో విధులను నిర్వహిస్తున్నా వేతనాల చెల్లింపుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కేంద్రం నిధులు ఇస్తున్నా..

ఉపాధిహామీ పథకం కింద నిధులను కేంద్రం విడుదల చేస్తుంది. ఈ నిధులతో చేసిన పనులకు చెల్లింపులతో పాటు సిబ్బందికి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఉపాధి హామీ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీలో పని చేస్తున్నా వేతనాల భారం మాత్రం కేంద్రంపైనే ఉంది. కేంద్రం చెల్లించే నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుండటంతో వేతనాల చెల్లింపులకు కటకట ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించి చేపట్టే పనులను ఈ పథకం ఉద్యోగులే పరిశీలిస్తున్నారు. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి పనులకు కేంద్రం నిధులు మంజూరు చేయడం లేదు. గ్రామాలలో ఏవైనా పనులు చేయాలన్నా, మౌళిక సదుపాయాలను కల్పించాలంటే ఉపాధి హామీ పథకం నిధులనే వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించి వారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో ఉపాధిహామీ ఉద్యోగులు	
ఏపీవోలు	20
కంప్యూటర్‌ ఆపరేటర్లు	36
ఇంజినీర్‌ కన్సల్టెంట్‌లు	11
టెక్నికల్‌ అసిస్టెంట్‌లు	67
ఫీల్డు అసిస్టెంట్‌లు	317

వేతనాలు సకాలంలో చెల్లించాలి..

ఉపాధిహామీ పథకం కింద పని చేసే ఉద్యోగులు ఎంతో శ్రమకోర్చి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం వేతనాల చెల్లింపుల విషయంలో జాప్యం చేయడం తగదు. కేంద్రం ఇచ్చే నిధుల నుంచే వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు.

– నర్సయ్య, ఏపీవోల సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వం స్పందించాలి..

ప్రభుత్వం ఉపాధి హామీ ఉద్యోగుల వేతనాల విషయంలో స్పందించాలి. ఏ కార్యక్రమం చేపట్టాలన్నా ఉపాధి నిధులను వినియోగిస్తున్నారు. ప్రభుత్వం వేతనాలు చెల్లించే విషయంలో జాప్యం చేయడం సరికాదు. ఎంతో మంది ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చేతికి అందక ఇబ్బంది పడుతున్నారు.

– సురేష్‌బాబు, ఉపాధి ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి

ఎంఎంపీటీఎఫ్‌ను పక్కాగా అమలుచేస్తాం

- కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి
- జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: యూఎన్‌వో ద్వారా ప్రయోగాత్మకంగా నిజామాబాద్‌ జిల్లాలో అమలు చేస్తున్న మైగ్రేషన్‌ మల్టీ పార్టనర్‌ ట్రస్ట్‌ ఫండ్‌ (ఎంఎంపీటీఎఫ్‌) కార్యక్రమాన్ని పక్కాగా అమలు పరుస్తూ, జిల్లా యంత్రాంగం తరఫున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం ఆయన జిల్లాస్థాయి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం జరిపారు. జిల్లాలో వలసదారులు, దుర్బల కుటుంబాల స్థితిగతులలో మార్పును తేవాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా, పూర్తి పారదర్శకంగా అమలయ్యేలా చూస్తామని అన్నారు. కార్యక్రమం ఉద్దేశ్యం, పైలెట్‌ ప్రాజెక్టుగా జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి మండలాలను ఎంపిక చేయడానికి గల కారణాలు, సహా పలు అంశాలపై చర్చించారు. జెడ్పీ సీఈవో సాయాగౌడ్‌, డీఏవో గోవిందు, డీపీఆర్‌వో పద్మశ్రీ, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్‌, డీడబ్ల్యూవో రసూల్‌బీ, డీపీవో శ్రీనివాస్‌, రోహిత్‌ రెడ్డి, మధుసూదన్‌, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను డిస్పోస్‌ చేయని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

జక్రాన్‌పల్లి: నిబంధనలకు అనుగుణంగా వ్యర్థాలను డిస్పోస్‌ చేయని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. జక్రాన్‌పల్లి మండలం పడకల్‌ గ్రామ శివారులోని శ్రీ మెడికేర్‌ సర్వీసెస్‌ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్‌ వేస్టేజీని నిర్వీర్యం చేసే ప్లాంట్‌ను కలెక్టర్‌ శుక్రవారం సందర్శించారు. జిల్లాలో 900 వరకు ప్రభుత్వ, ప్రయివేట్‌ ఆస్పత్రులు కొనసాగుతుండగా, సగానికి పైగా ఆస్పత్రుల నుంచి వ్యర్థాలను సేకరించడం లేదని కలెక్టర్‌ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్ట్‌ ఏజెన్సీకి వ్యర్థాలు అందించని ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలని, అయినప్పటికీ మార్పు రాకపోతే ఆస్పత్రుల అనుమతులను రద్దు చేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీని ఆదేశించారు. ఏజెన్సీ పనితీరును పర్యవేక్షించాలని కాలుష్య నియంత్రణ మండలి ఏఈ మానసను ఆదేశించారు.



పడకల్‌లో డీఎంహెచ్‌వో రాజశ్రీతో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

సెంట్రల్‌ డ్రగ్స్‌ స్టోర్‌ తనిఖీ..

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని గంగాస్థాన్‌ ఫేజ్‌–1లోగల సెంట్రల్‌ డ్రగ్స్‌ స్టోర్‌ (సీ.డీ.ఎస్‌)ను కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. ఇండెంట్‌ వచ్చిన వెంటనే తాత్సారం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలు పంపించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులు ప్రబలె ప్రమాదం ఉన్నందున అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్ట్‌ గంగాధర్‌ను ఆదేశించారు.

కట్టని గోడలు.. ఈ బండరాళ్లు





ప్రాజెక్ట్‌ వరద గేట్ల ముందర విశాలమైన బండరాళ్లు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి ప్రతియేటా గోదావరిలోకి వదిలే మిగులు జలాల తాకిడిని బండరాళ్లు తట్టుకొని నిలబడుతున్నాయి. 42 వరద గేట్ల ద్వారా నీటిని వదిలినా బండరాళ్లు చెక్కుచెదరకుండ కట్టని గోడలా నిలబడుతున్నాయి. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నిర్మాణం ముందుగా కుస్తాపూర్‌ వద్దనే నిర్మించాలని నిర్ణయించారు. కాని విశాలమైన బండరాయి లేకపోవడంతో అక్కడి నుంచి, విశాలమైన బండరాళ్లు గల పోచంపాడ్‌కు మార్చి నిర్మించారు. ప్రస్తుతం వరద గేట్ల ద్వారా నీటి విడుదల నిలిపి వేయడంతో ఈ బండరాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో పర్యాటకులు ప్రాజెక్ట్‌ డ్యాం వైపు కంటే దిగువన గోదావరి వైపునకే వస్తున్నారు.

26 వరకు ఓపెన్‌ వర్సిటీలో ప్రవేశాలు

నిజామాబాద్‌అర్బన్‌: నగరంలోని అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో ఈనెల 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ప్రవేశాలు పొందవచ్చని కో–ఆర్డినేటర్‌ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు, ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చేపలు చేజారుతున్నాయి..

- వరద గేట్ల నుంచి నీటి ప్రవాహంతో కొట్టుకుపోతున్న వైనం
- ఎస్సారెస్పీలో ప్రతియేటా ఇదే పరిస్థితి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు



ప్రాజెక్ట్‌ దిగువన గోదావరిలో చిక్కిన చేపలు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి వరద గేట్ల ద్వారా నీటిని గోదావరిలోకి విడుదల చేసినప్పుడు వరదతోపాటు చేపలు కూడా కొట్టుకు పోతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్‌ వరద గేట్ల దిగువన కేవలం గురువారం ఒక్క రోజు వేటాడితే ఎక్కువ సంఖ్యలో చేపలు చిక్కడమే ఇందుకు నిదర్శనమని వారు పేర్కొంటున్నారు. అలాంటిది వరద ప్రవహించినప్పుడు ఎన్ని చేపలు కొట్టుకుపోయింటాయోనని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రాజెక్ట్‌ నుంచి మిగులు జలాలను వదిలే వరద కాలువ ద్వారా కూడ అధికంగా చేపలు వెళ్లిపోతున్నాయి. దీంతో వరద కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ వద్ద ఉన్న 6 గేట్లకు జాలిగేట్లను అమర్చాలని ఏళ్లుగా మత్స్యకారులు పాలకులు, అధికారుల చుట్టు తిరుగుతున్నారు. కానీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రతి సంవత్సరం ప్రాజెక్ట్‌లో 62 లక్షల చేపపిల్లలను ఉచితంగా వదులుతారు. కానీ చివరిలో వేటాడుటకు చేపలు ఉండవు. కారణం వరదల వలన దిగువకు కొట్టుకు పోవడమే. దీంతో వరద గేట్లకు చేపలు కొట్టుకుపోకుండ జాలి గేట్లు బిగించాలని కొన్నాళ్లుగా మత్స్యకారులు డిమాండ్‌ చేస్తున్నారు. దీనిపై 'సాక్షి' అధికారులను వివరణ కోరగా.. వరద గేట్లకు జాలిలు ఏర్పాటు చేయడం సాధ్యం కాదని వివరించారు. వరద కాలువ గేట్లకు ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు.

జాలి గేట్లను బిగించాలి..

వరద గేట్లకు, వరద కాలువ గేట్లకు జాలి గేట్లను నిర్మించాలి. జాలి గేట్లు లేకపోవడంతో కిందకి చేపలు కొట్టుకుపోతున్నాయి. చిన్న, పెద్ద చేపలు తేడా లేకుండ పోతున్నాయి. ప్రభుత్వం ఆలోచించి, మత్స్యకారుల సమస్యను పరిష్కరించాలి.

– శ్రీనివాస్‌, మత్స్యకారుడు, బాల్కొండ

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 30215 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 8 వరద గేట్లను తెరచి 12,500 క్యూసెక్కులు నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 8 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌ గేట్ల ద్వారా 8వేలు, సరస్వతి కాలువ ద్వారా 800, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు పోతుంది. కాకతీయ కాలువ, గుత్ప, అలీసాగర్‌ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. ప్రాజెక్ట్‌లో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.



నూతన కార్యవర్గం ఎన్నిక



సుభాష్‌నగర్‌: నగరశివారులోని శ్రావ్యగార్డెన్‌లో శుక్రవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్‌ 1104 యూనియన్‌ ఎన్‌పీడీసీఎల్‌ డిస్కం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌పీడీసీఎల్‌ డిస్కం కార్యవర్గ ఎన్నికలు (16 జిల్లాలు) నిర్వహించారు. ఎన్‌పీడీసీఎల్‌ డిస్కం అధ్యక్షుడిగా బి రఘునందన్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ వెంకట రమణరావు, అదనపు కార్యదర్శిగా ఎండీ ఆరీఫ్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నాయకులు సన్మానించి, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి సాయిబాబు, అదనపు కార్యదర్శి వరప్రసాద్‌, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిస్కం కార్యదర్శి శేషగిరి రావు, అదనపు కార్యదర్శి రంగారావు, జిల్లా ముఖ్య సలహాదారులు లక్ష్మణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ డీసీ రాజు, 16 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులు జిల్లా అభివృద్ధిపై దృష్టిపెట్టాలి

- కాంగ్రెస్‌ కామారెడ్డి బీసీ సభను బహిష్కరించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి



సుభాష్‌నగర్‌: జిల్లా ఇన్‌చార్జి మంత్రులు పర్యటనలు మానుకుని జిల్లా అభివృద్ధి, వరద బాధిత కుటుంబాలను ఆదుకోవడంపై దృష్టిసారించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి డిమాండ్‌ చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితుల పట్ల ప్రభుత్వం, మంత్రులు కనీసం కనికరం చూపకపోవడం సిగ్గుచేటన్నారు. కామారెడ్డిలో వరద బాధితులకు రూ.11,500 పంపిణీ చేశారని, కానీ రూరల్‌ నియోజకవర్గంలో బాధితులను పట్టించుకోలేదన్నారు. కామారెడ్డిలో కాంగ్రెస్‌ నిర్వహించేది బీసీల సభ కాదని, మైనార్టీ రిజర్వేషన్ల కోసం నిర్వహించే బహిరంగ సభ అని విమర్శించారు. సభకు బీసీలు, బలహీనవర్గాలు, బీసీ సంఘాలు దూరంగా ఉండాలని, ఆ సభను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రమోద్‌, మాస్టర్‌ శంకర్‌, జ్యోతి, నాగరాజు, ఓంసింగ్‌, శ్రీనివాస్‌రెడ్డి, తారక్‌ వేణు, అంబదాస్‌, ఆకుల శ్రీనివాస్‌, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



బోధన్‌ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మృతుల బంధువులు, కార్మిక సంఘాల నాయకులు

బోధన్‌ టౌన్‌ (బోధన్‌): ట్రాక్టర్‌ బోల్తాపడటంతో జీపీ కార్మికులు బాలాజీ, యాదు మృతిచెందడంతో బాధిత కుటుంబాలను ఆదుకోవాలని బంధువులు, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు విద్యుత్‌ కాంట్రాక్టర్‌ నష్టపరిహారము చెల్లించాలని, ప్రభు త్వం మృతిచెందిన కార్మికులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. రెండు ఎకరాల పొలం, ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పిల్లల చదువుల బాధ్యత తీసుకోవాలన్నారు. సమాచారం అందుకున్న బోధన్‌ తహసీల్దార్‌ విఠల్‌, డీఎల్‌పీవో, రూరల్‌ సీఐ విజయ్‌బాబు వారిని సముదాయించారు. అనంతరం సబ్‌కలెక్టర్‌ వికాస్‌మహతో వద్దకు వెళ్లి చర్చలు జరిపారు. మృతుల కుటుంబాలకు బోధన్‌లో ప్లాట్లు ఇస్తామని, కు టుంబ సభ్యులకు ఉద్యోగం కల్పిస్తామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని కల్పిస్తామని సబ్‌ కలెక్టర్‌ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు నరేందర్‌, సుధాకర్‌, మల్లేష్‌, నూర్జహాన్‌, శంకర్‌ గౌడ్‌, జంగం గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

నాయబ్‌ తహసీల్దార్లకు పదోన్నతి

నిజామాబాద్‌అర్బన్‌: పలువురు నాయబ్‌ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర రెవెన్యూ శాఖ శుక్రవారం జారీ చేసింది. కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న నేనావత్‌ రాక, నిర్మల్‌ జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి తహసీల్దార్లుగా పదోన్నతి పొంది జిల్లాకు రానున్నారు. కాగా ఇదే జిల్లాలో పనిచేస్తున్న నరేష్‌ నాయబ్‌ తహసీల్దార్‌ నుంచి తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. వీరికి త్వరలోనే మండలాలు కేటాయించనున్నారు.

పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీయవద్దు



ఖలీల్‌వాడి: పోలీసుల ఆత్మస్థైర్యంను దెబ్బతీయవద్దని, పోలీసులకు అందరు సమానులేనని నిజామాబాద్‌ పోలీస్‌ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షకీల్‌ పాషా అన్నారు. జిల్లాకేంద్రంలోని కమాండ్‌ కంట్రోల్‌ రూమ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులపై బీఆర్‌ఎస్‌ పార్టీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. ఆర్మూర్‌లోని యాసీన్‌ హోటల్‌ నిబంధనలకు విరుద్ధంగా రాత్రివేళ కొనసాగడంతో కేసులు నమోదు చేశామన్నారు. పోలీసుల పేర్లు పింక్‌బుక్‌లో రాస్తామని సదరు నాయకుడు చెప్పడం సరైనది కాదన్నారు. పోలీసులు నిబంధనలకు అనుకూలంగా పనిచేస్తారని, ఎవరిపై కక్షపూరితంగా వ్యవహరించరని తెలిపారు. మరోసారి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్‌ సంఘం ప్రతినిధులు చందూలాల్‌, సాయిలు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చాలా కీలకం



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చాలా కీలకమని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌ కమిషనర్‌ కార్యాలయంలో శుక్రవారం క్రాష్‌ ఇన్వెస్టిగేషన్‌ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన అవసరమని సీపీ అన్నారు. ప్రతి ప్రమాదం వెనక ఉన్న అసలైన కారణాలను వెలికితీసి, భవిష్యత్‌లో అలాంటి ఘటనలు జరగకుండా చూసేందుకు సహాయపడుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి పోలీస్‌ సిబ్బంది సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. డీసీపీ (అడ్మిన్‌) బస్వారెడ్డి, ట్రాఫిక్‌ ఏసీపీ మస్తాన్‌ అలీ, వర్షా నిహంత్‌, సేవ్‌ లైఫ్‌ ఫౌండేషన్‌ ప్రతినిధులు సాహిల్‌ మోటో, నూర్‌ ఖాట్టర్‌ పాల్‌, చిరాగ్‌ కాటేగర్‌, సీటీసీ సర్కిల్‌ సీఐ శివరాం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

దుబాయ్‌లో మోపాల్‌ వాసి మృతి



సవీన్‌ (ఫైల్‌)

మోపాల్‌: మండలకేంద్రానికి చెందిన తలారి సవీన్‌ (35) దుబాయ్‌లో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. సవీన్‌ ఆగస్ట్‌ 16న ఉపాధి నిమిత్తం దుబాయ్‌ వెళ్లాడు. 21న కంపెనీలో పని ముగించుకుని గదిలోకి వచ్చిన సవీన్‌.. ఫోన్‌, పర్సు, గుర్తింపు కార్డులు పెట్టి వెళ్లిపోయాడు. ఈనెల 26న రోడ్డు పక్కన చెట్టు కింద విగతజీవిగా పడి ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వివరాల కోసం ప్రయత్నించారు. తెలియకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా గల్ఫ్‌ సంఘాలు, గ్రామస్తులు సవీన్‌ తప్పిపోయాడని వీడియో రూపొందించి వైరల్‌ చేశారు. ఆ వీడియోను పరిశీలించిన పోలీసులు.. వివరాలు సేకరించి కంపెనీకి సమాచారమిచ్చారు. సవీన్‌ మృతి వార్త తెలుసుకున్న కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గల్ఫ్‌ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. త్వరగా మృతదేహాన్ని రప్పించే ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మృతుడి తండ్రి తలారి చిన్న లక్ష్మణ్‌ సైతం దుబాయ్‌లో ఉన్నాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని భార్య కృష్ణవేణి కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు

బోధన్‌రూరల్‌: సాలూర మండలకేంద్రంలోని శివారులో శుక్రవారం ఓ కారు అతివేగం కారణంగా అదుపుతప్పి విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు, ట్రాన్స్‌ఫార్మర్‌ ధ్వంసమయ్యాయి. కారులోని ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో బోధన్‌ రూరల్‌ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి



కిరణ్‌ కుమార్‌గౌడ్‌ (ఫైల్‌)

నిజామాబాద్‌ లీగల్‌: నగరానికి చెందిన న్యాయవాది పెద్దగాని కిరణ్‌ కుమార్‌ గౌడ్‌ (57) గుండెపోటుతో మృతి చెందాడు. కిరణ్‌ శుక్రవారం సాయంత్రం ఆఫీసర్స్‌ క్లబ్‌కు చేరుకున్న కొద్ది సేపటికి ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ప్రారంభిస్తుండగానే గుండెపోటుతో ప్రాణాలు వదిలాడు. 1997లో న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన కిరణ్‌ కుమార్‌ గౌడ్‌, సీనియర్‌ న్యాయవాది నారాయణరెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశాడు, న్యాయవాదిగా సివిల్‌, క్రిమినల్‌ కేసులు వాదించాడు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. గవర్నమెంట్‌ ప్లీడర్‌గా, న్యాయవాదుల సొసైటీ వ్యవస్థాపక సభ్యుడిగా, ఆఫీసర్స్‌ క్లబ్‌ కార్యదర్శిగా పనిచేశాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కిరణ్‌ మృతిపట్ల నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ సోమవారం సంతాప సభ నిర్వహించనున్నట్లు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మామిళ్ల సాయిరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ ..

రుద్రూరు: ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు రుద్రూర్‌ ఎస్సై సాయన్న వెల్లడించారు. వివరాలు ఇలా.. మండలంలోని బొప్పాపూర్‌ గ్రామానికి చెందిన గాండ్ల సావిత్రి (62) ఈనెల 11న కడుపునొప్పి బాధ భరించలేక యాసిడ్‌ తాగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కొడుకు అశోక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహితతో అసభ్య ప్రవర్తన.. నిందితుడికి మూడేళ్ల జైలు

నిజామాబాద్‌ లీగల్‌: వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తి నిజామాబాద్‌ నాల్గవ అడిషనల్‌ మహిళ న్యాయస్థానం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించింది. వివరాలు ఇలా.. రెంజల్‌ మండల కేంద్రానికి చెందిన గైని కిరణ్‌ 2023 ఏప్రిల్‌ 14న తన పక్కింట్లో నివసించే వివాహిత ఒంటరిగా ఉండగా ఆమె ఇంట్లోకి ప్రవేశించి, అసభ్యకరంగా ప్రవర్తించాడు. వెంటనే ఆమె కేకలు వేయడంతో భర్త అక్కడికి చేరుకుని కిరణ్‌ను పట్టుకునేందుక ప్రయత్నించగా, ఫరారయ్యాడు. దీనిపై దత్తు తన భార్యతో కలిసి రెంజల్‌ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని జిల్లా కోర్టులో హాజరుపర్చారు. జడ్జి సాక్ష్యాలను విచారించిన అనంతరం నిందితుడు గైని కిరణ్‌కు మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. అలాగే జిల్లా న్యాయసేవ సంస్థ బాధితురాలికి రూ.50వేల పరిహారం చెల్లించాలని జడ్జి తన తీర్పులో సూచించారు.